క్లుప్తంగా

ప్రత్తిపాడు ఎంపీడీవోగా దుర్గాప్రసాద్



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎంపీడీవోగా కోలవెంటి దుర్గాప్రసాద్ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఏ శ్రీరమ్యను ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేయడంతో ఆమె బుధవారం రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె స్థానంలో దుర్గాప్రసాద్‌ను ఉన్నతాధికారులు నియమించడంతో ఆయన విధుల్లో చేరారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రామకోటయ్య దుర్గాప్రసాద్‌కు చార్జ్ అప్పగించారు.

ఎంపీడీవోగా సునీతశర్మ



పెదనందిపాడు: పెదనందిపాడు ఎంపీడీవోగా సునీతశర్మ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న రాజగోపాల్ బాపట్ల జిల్లా పర్చూరు మండలానికి బదిలీ అవ్వగా, కృష్ణ జిల్లా పెనుమలూరు ఎంపీడీవోగా పని చేస్తున్న సునీతశర్మ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సునీత శర్మకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

చేబ్రోలు ఎంపీడీవోగా జ్యోతి



చేబ్రోలు: చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా కె.జ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బి.బాబురావును ప్రకాశం జిల్లా కారంచేడు బదిలీ చేశారు. కృష్ణాజిల్లా చందర్లపాడు ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.జ్యోతిని చేబ్రోలుకు బదిలీ చేయటంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంపీడీవో జ్యోతిని సూపరింటెండెంట్ ఉమాదేవి, ఈవోపీఆర్డీ జి.శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు అభినందించారు.


పొన్నూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పొన్నూరు: ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ పేర్కొన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం పొన్నూరు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎల్ఈడీ డిస్‌ప్లే ద్వారా పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

చట్టసభల్లో కాపులకు ప్రాధాన్యం కల్పించాలి

ప్రజా కాపునాడు జిల్లా అధ్యక్షునిగా యర్రంశెట్టి



పెదకాకాని: చట్టసభల్లో కాపులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రజా కాపునాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి నాగరాజు అన్నారు. పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి నాగరాజు జనవరి 27న జరిగిన సమావేశంలో గుంటూరు జిల్లా ప్రజా కాపునాడు అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చట్టసభల్లో కాపులకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. కాపులంతా ఐకమత్యంగా ఉండాలని, అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం కొప్పురావూరు అడ్డరోడ్డులో ఉన్న లిటిల్‌సిస్టర్స్ ఆఫ్ ది పూర్ వయోవృద్ధుల ఆశ్రమంలో నిర్వాహకులు, వృద్ధులతోనూ మాట్లాడారు. ఆశ్రమంలో వసతుల కల్పనకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ

పొన్నూరు: పట్టణ, మండలంలో వేకువ జాము నుంచే వలంటీర్లు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి, డబ్బులు అందజేశారు. ఉదయాన్నే పింఛన్ అందడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. పొన్నూరులో దాదాపు 85 శాతం పింఛన్ పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేస్తున్నారు.

నాడు నరకం .. నేడు మురిపెం

- గత టీడీపీ ప్రభుత్వంలో పింఛనుకు నానా అగచాట్లు
- కొత్తవి కావాలన్నా.. ఉన్నవి తీసుకోవాలన్నా నరకమే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులతో నేరుగా ఇంటి వద్దకే పింఛను
- నెలలో తొలిరోజే తొంభై శాతం పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్లు
- పూర్తి పారదర్శకంగా నూతన పింఛన్లు మంజూరు





గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను కోసం పంచాయతీ కార్యాలయాల్లో వృద్ధుల అగచాట్లు (ఫైల్)

ప్రత్తిపాడు: గత టీడీపీ పాలనలో.. పింఛను కావాలంటే పంచాయతీ కార్యాలయాల వద్ద పొద్దుపొడిచిన నుంచి పొద్దు పోయే వరకు పడిగాపులు కాసిన ఆ మాయదారి రోజులు గుర్తున్నాయా.. సర్వరు రాక, పింఛను ఇవ్వక, గుక్కెడు నీళ్ల లేక, కార్యాలయం ముందే సొమ్మసిల్లి పడిపోయిన ఆ అధ్వాన్నపు రోజులు గుర్తున్నాయా.. మండే ఎండలో చెట్ల నీడన నిలువుకాళ్లపై నిలబడి నీరసించినా పట్టించుకునే నాథుడు లేని ఆ రోజులు గుర్తున్నాయా..దివ్యాంగులను, పండు ముదుసలిని, మూడు కాళ్ళతో నడిచే అవ్వతాతలను రిక్షాలపై పంచాయతీ కార్యాలయాలకు తీసుకెళ్లేందుకు పడిన వ్యయప్రయాసలు గుర్తున్నాయా.. కొత్త పింఛను కావాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాల కోసం వాళ్లింటి చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా దయచూపని రోజులు గుర్తున్నాయా.. పింఛనుకు వెళ్లాలంటే పొద్దున్నే చద్దన్నం మూటగట్టుకుని పంచాయతీ కార్యాలయం ముందే చతికిలబడి నాలుగు పచ్చడి మెతుకులు ఎంగిలిపడ్డ రోజులు గుర్తున్నాయా.. కొత్త పింఛను కావాలంటే ఎవరో ఒకరు కళ్ల మూస్తారేమోనని కాటివైపు దీనంగా చూసిన రోజులు గుర్తున్నాయా.. ఇలా పింఛను మంజూరు కావాలన్నా..

నెల నెలా పింఛను తీసుకోవాలన్నా ఒకటా.. రెండా..? కర్ణుడి శాపల్లా.. ఎన్నో సమస్యలు, మరెన్నో అగచాట్లు. అంతకు మించి వ్యయప్రయాసలు. కన్నీళ్లను కళ్లల్లోనే దాచుకుని, బాధను పంటి బిగువునే భరించి ఎందరో లబ్ధిదారులు పింఛను తీసుకునేందుకు నానా పాట్లు పడేవారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో.. పాతమల్లాయపాలెంలో గురువారం ఇంటి వద్దనే ప్రత్యేక అవసరాలు గల వ్యక్తికి పింఛను ఇస్తున్న వలంటీరు

కానీ కాలం మారింది.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గద్దెనెక్కింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అర్హతే ప్రామాణికంగా పింఛను మంజూరు చేసే మంచి రోజులొచ్చాయి. క్యూలైన్లలో నిలబడే రోజులు పోయి, భానుడు ఉదయించకముందే ఇంటి తలుపు తట్టి పింఛను ఇచ్చే రోజులొచ్చాయి.

ఒకటవ తేదీనే.. కోడికూయక ముందే

వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవ్వతాతలకు ఒకటవ తేదీనే పింఛను అందిస్తున్నారు. తొలిరోజే సుమారు తొంభై శాతం మందికిపైగా పింఛను పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో మొత్తం 33,370 (జనవరి నెల కొత్తగా మంజూరైన పింఛన్లతో కలిపి) పింఛన్లు ఉన్నాయి. వీరికి నెల నెలా రూ.9.87 కోట్ల నగదు పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నారు.

మండలాల వారీగా పింఛన్లు, నగదు వివరాలు..

మండలం	లబ్ధిదారులు	నగదు (కోట్లలో)
ప్రత్తిపాడు	7,425	రూ. 2.19
గుంటూరురూరల్	4,756	రూ. 1.41
కాకుమాను	7,018	రూ. 2.07
పెదనందిపాడు	6,979	రూ. 2.07
వట్టిచెరుకూరు	7,192	రూ. 2.13
మొత్తం	33,370	రూ. 9.87

కొత్తగా 486 మందికి..

రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలో అదనంగా 486 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసింది. వీరికి అదే నెల పింఛను నగదును కూడా అందజేశారు. గుంటూరురూరల్ మండలంలో 77, కాకుమాను మండలంలో 101, పెదనందిపాడులో 122, ప్రత్తిపాడులో 102, వట్టిచెరుకూరులో 84 మంజూరయ్యాయి. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ.250 చొప్పున మూడు వేలకు పెంచుకుంటూ వచ్చారు.

ఆ కష్టాలు ఇప్పుడు లేవయ్యా..



గత ప్రభుత్వంలో పింఛను తీసుకోవాలంటే ప్రత్యక్షంగా నరకం కనిపించేది. క్యూలైన్లలో నిలబడటం, అక్కడే వాళ్ల వచ్చేదాక కూర్చోవడం ఎప్పుడు వెళితే ఎప్పుడు ఇచ్చే వారో కూడా తెలియని పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ఆ భగవంతుడి దయ వల్ల పింఛనుదారులకు ఆ కష్టాలు లేవయ్యా. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇంటికే వలంటీర్లను పంపి పింఛను ఇస్తున్నారు. –పమ్మి సుబ్బాయమ్మ, కొత్తమల్లాయపాలెం

ఇచ్చిన మాట ప్రకారం మూడు వేలకు పెంచారు..



పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా పింఛను మూడు వేలకు పెంచుకుంటూ వెళ్లారు. జనవరి నుంచి రూ.3 వేలు ఇస్తున్నారు. ఈ పెంపు పింఛనుదారులకు కొండంత భరోసానిస్తుంది. వలంటీరే ప్రతి నెల ఇంటికొచ్చి పింఛను అందిస్తున్నాడు. –కట్టా భారతి, అబ్బినేనిగుంటపాలెం

ప్రతి ఒక్కరికి ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- విద్యకు పేదరికం అడ్డుకాకూడదని విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- నంబూరు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూ.50 లక్షల భవనానికి శంకుస్థాపన



నంబూరు జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వేమన ప్రోలయ జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రూ.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న భవనానికి గురువారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ విద్యనభ్యసించడానికి పేదరికం అడ్డుకాకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో అక్షరాస్యతను గాలికి వదిలేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసారన్నారు. అక్షరాస్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం మన బడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కోవాలనే ఆశయంతో ఇంగ్లీషు మీడియం బోధనకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. రూ.50 లక్షల వ్యయంతో పాఠశాలలో భవనం నిర్మిస్తున్న పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ముందుగా భవన నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, బొంతు శివారెడ్డి, మందాళ శివారెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మధిర శేషయ్య, ఆరుదల శంకరరావు, సయ్యద్ ఖాజామొహిద్దీన్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, హెచ్‌ఎం వాకా జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వింజనంపాడులో కిట్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా శిబిరం



పంటపొలాల్లో రైతులతో కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం విజనంపాడులో కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు గురువారం సేవా శిబిరాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు జరగనున్న శిబిరాల్లో భాగంగా తొలి రోజు విద్యార్థులు పంట పొలాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. పంటల సాగు విధానం, పురుగు మందుల పిచికారీ, సేంద్రియ వ్యవసాయం, అధిక దిగుబడులకు సస్యరక్షణ పద్ధతులను తెలుసుకున్నారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందులను వినియోగించడం వలన భూసారం దెబ్బతింటుందని, ప్రతి ఏటా క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించి, పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. మొదటి రోజు శిబారాన్ని గ్రామ సర్పంచ్ ఎస్.నాగలక్ష్మి, ఎంపీటీసీ సుజాత, కార్యదర్శి పి.శివప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ యూనివర్సిటీలో మాట్లాడుతున్న ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ రఘు కుంచె



విజ్ఞాన్ మహోత్సవ్ సందర్భంగా వివిధ అంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలు







చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే విజ్ఞాన్ 2కె24 పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – చేబ్రోలు

పట్టణ, రూరల్ సీఐల బాధ్యతల స్వీకారం



రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు



పట్టణ సీఐ పి.భాస్కర్

పొన్నూరు: పొన్నూరు పట్టణ సీఐగా పి.భాస్కర్, రూరల్ సీఐగా వై.కోటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వీరిరువురు పొన్నూరు పోలీస్ స్టేషన్లకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదని అన్నారు. పేకాట, మట్కా జూదాలు ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగికి సత్కారం



పెదకాకాని: అంకితభావంతో విధులు నిర్వహించిన వారికి సత్కారాలు, అభినందనలు తప్పక వస్తాయని లింగంగుంట కిషోర్ అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీలో గ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న వేముల విజయ్‌కుమార్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి సత్కారంతో పాటు సర్టిఫికెట్ అందుకున్నారు. పెదకాకాని గ్రంథాలయంలో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే కొత్త కొత్త పుస్తకాలు తెప్పించడం, వేసవి తరగతులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించి గుర్తింపు తెచ్చుకున్న విజయ్‌కుమార్‌ను గురువారం స్థానిక పెద్దలు సత్కరించారు. అభినందించిన వారిలో పాటిబండ్ల మంత్రయ్య, లింగంగుంట రవి, బండ్లమూడి ప్రవీణ్‌కుమార్, మద్దాల ఏలియ, బంగారు అశోక్, సంకూరి పండు, సంగుల జయప్రకాష్, కారుమంచు ఏసోబు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి పథంలో పొన్నూరు

రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా



సమావేశంలో సైపుల్లా

పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పొన్నూరు నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సైపుల్లా మాట్లాడుతూ మైనారిటీ కమిషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2022–23లో 140 మైనారిటీల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. గత పాలికేళ్ల టీడీపీ హయాంలో అభివృద్ధి జాడేలేని పొన్నూరుగా తీర్చిదిద్దిన ఘనత నరేంద్రది కాదా అని విమర్శించారు. గడచిన నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే రోశయ్య సారథ్యంలో పొన్నూరు వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ నాయకులు వ్యక్తిగత దూషణలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణమోహన్ కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని అన్నారు. రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పొన్నూరులో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు ఎంఏ మహమూద్, రుద్రపాటి ఆదిశేషులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

మంచాల యూపీ స్కూల్‌లో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



మంచాల(చేబ్రోలు): విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధనకు కృషి చేయాలని చేబ్రోలు మండలం మంచాల గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని మంచాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆయన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో సర్పంచ్ సొంత ఖర్చుతో చదువుల తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. హెచ్‌ఎం రత్నశేఖర్, ఆదిన లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబుల అందజేత

మంచాల యూపీ స్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు ట్యాబులను అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

8న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చర్చించడం జరుగుతుందని చెప్పారు. సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

డిప్యూటీ ఎస్‌వో భానుశ్రీ



గనికపూడిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం

గనికపూడి (ప్రత్తిపాడు): రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్‌వో) భానుశ్రీ తెలిపారు. మండల పరిధిలోని గనికపూడిలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం గనికపూడి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఏఎన్‌ఎం నిర్వహించాల్సిన పన్నెండు రకాల రిజిస్టర్ల నిర్వహణతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. యాంటినేటల్ గృహాలను సందర్శించి హెచ్‌బీ పరీక్షలు చేసి, రికార్డుల్లో ఉన్న విధంగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తనిఖీ చేసి ఏఎన్‌ఎం పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణతో పాటు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కూడా సకాలంలో సక్రమంగా పూర్తి చేయాలని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. అదేవిధంగా గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో విధులను నిర్వర్తించాలని చెప్పారు. డీపీహెచ్‌ఎన్ శాంతకుమారి, గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్, సిబ్బంది సైమన్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం తదితరులున్నారు.

కల్వర్ట్ ప్రారంభం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన కల్వర్ట్‌ను గురువారం ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీడీఓ భార్గవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎండీఎఫ్ నిధులు రూ.12 లక్షలతో కల్వర్ట్ నిర్మాణంతో పాటు సీసీ రోడ్ నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి దేవరపల్లి వీరయ్య, పంచాయతీ సెక్రటరీ మణికంఠ, చింతలపూడి మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగిస్తే సహించేది లేదు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి నలాం సెంటర్, ముగ్గురోడ్డు రామాలయం, లంబాడీ పేట, పోతురాజుగుడి తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల ఇళ్లు తొలగిస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. రైల్వే స్థలాల్లో నివసిస్తున్న వారు ఫిబ్రవరి 3వ తేదీ లోపు ఖాళీ చేయాలని రైల్వే అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఆ పార్టీ నేతల బృందంతో కలసి ఆయన పర్యటించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 80–90 ఏళ్ల క్రితం రైల్వే కాంట్రాక్ట్ పనులకు తీసుకువచ్చిన ప్రజలకు ఈ స్థలాలు చూపించారని, వారు ఇక్కడ ఇళ్లు వేసుకుని జీవిస్తున్నారని చెప్పారు. అజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయం చూపకుండా ఆకస్మాత్తుగా వెళ్లి పొమ్మనడం దారుణమన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కాశయ్య, వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.